www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 19 డిసెంబర్ 2024 5
ఏలూరు



21న జెడ్‌పి సర్వసభ్య ప్రత్యేక సమావేశం
అదే రోజు మధ్యాహ్నం సాధారణ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

జెడ్‌పిటిసిల అభ్యర్థన మేరకు ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం పది గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి ఇన్‌ఛార్జి సిఇఒ డాక్టర్ ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సమావేశానికి సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహిస్తారని తెలిపారు. సదరు సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కొల్లేరులో మరోసారి అటవీ శాఖాధికారులు హడావుడి చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంటూ పలు చేపల చెరువులకు గండ్లు కొట్టడం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమైతే కొల్లేరులోని ఐదో కాంటూరు లోపల ఉన్న అన్ని అక్రమ చేపల చెరువులకు గండ్లు కొట్టాలని, అలాకాకుండా ప్రత్యేకంగా ఎంచుకున్నట్లు కొన్ని చెరువుల వద్దకే వెళ్లి గండ్లు కొట్టడం ఏమిటనే అనుమానాలు సర్వత్రా నెలకొన్నాయి. ఇదంతా రాజకీయ ప్రమేయంతోనే జరుగుతుందా అనే చర్చ సాగుతోంది. చేపల చెరువుల యజమానులను బెదిరించి దారికి తెచ్చుకుని డబ్బులు వసూలుకే నాయకులు ఇదంతా చేస్తున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది.



కొల్లేరులో హడావుడి..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాదాపు 77 వేల ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యం విస్తరించి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా అభయారణ్యం పరిధిలో విచ్చలవిడిగా చేపల చెరువుల తవ్వకాలు సాగాయి. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో దాదాపు 43 వేల ఎకరాల్లో చేపల చెరువులను ధ్వంసం చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో పట్టా భూముల్లోని చేపల చెరువులను సైతం బాంబులు పెట్టి మరీ అధికారులు ధ్వంసం చేశారు. చేపల చెరువులకు గండ్లు కొట్టడంతో కొల్లేరు ప్రాంతంలోని దాదాపు 120 గ్రామాల ప్రజల ఉపాధి దెబ్బతింది. దీంతో కొల్లేరు కాంటూరు పరిధిని కుదించాలని అక్కడి ప్రజలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. దాని పరిస్థితిపై ఇప్పటి వరకూ ఎటువంటి పురోగతీ లేదు. రాజకీయ నాయకులు మాత్రం కొల్లేరు వ్యవహారాన్ని ఒక ఆర్థిక వనరుగా వాడుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ ఎంఎల్ఎలు కొల్లేరులో చేపల చెరువులు తవ్వించేస్తూ వాటిలో వాటాలు తీసుకుంటూ భారీగా దండుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు దీనికి పూర్తిగా సహకరిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందితే, మీడియాలో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే గండ్లు కొడుతున్నామని హడావుడి చేయడం, ఆపై యథారాజా తథా ప్రజా అన్నట్లు ఉంటున్న పరిస్థితి కన్పిస్తోంది. గడిచిన వైసిపి ప్రభుత్వంలోనూ, అంతకుముందు సైతం కొల్లేరులో పెద్దఎత్తున అక్రమ చెరువుల తవ్వకాలు సాగాయి. కొల్లేరును ఆనుకుని ఉన్న కైకలూరు, ఉండి, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో చేపల చెరువుల తవ్వకాలు విచ్చలవిడిగా సాగాయి.

మళ్లీ హడావుడి..★★★

ఆపరేషన్ కొల్లేరులో తర్వాత మళ్లీ దాదాపు 18 వేల ఎకరాల్లో చేపల చెరువుల అక్రమ తవ్వకాలు సాగినట్లు అంచనా వేస్తున్నారు. దీనిపై కొంతమంది సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో అధికారులపై మళ్లీ ఒత్తిడి పెరగడంతో పలు చేపల చెరువులకు గండ్లు కొడుతూ అధికారులు హడావుడి చేస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చేపల చెరువులకు గండ్లు కొట్టడంపై ఎవరికీ ఏ అభ్యంతరం లేదు. అయితే అధికారులు గండ్లు కొడుతున్న వ్యవహారం మాత్రం పలు అనుమానాలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొల్లేరులో ఐదో కాంటూరు పరిధిలో చేపల చెరువులు సాగు చేస్తున్న యజమానులకు కొంతమంది ప్రజాప్రతినిధుల నుంచి హెచ్చరికలు వెళ్లినట్లు ప్రచారం సాగింది. 'మీరు ఏ ఇబ్బందీ లేకుండా కొల్లేరులో చేపల చెరువుల సాగు చేసుకోవాలంటే ఎకరాకు రూ.పది వేలు వరకూ ఇవ్వాలి' అని పలువురు నాయకులు డిమాండ్ చేసినట్లు అప్పట్లో పెద్దఎత్తున చర్చ సాగింది. తర్వాత ఏం జరిగిందో ఏమోగానీ విషయం సద్దుమణిగింది. ఇప్పుడు మళ్లీ చేపల చెరువులకు అధికారులు గండ్లు కొడుతుండటం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు తూచతప్పకుండా పాటించాలంటే కొల్లేరు కాంటూరు లోపల ఉన్న చేపల చెరువులన్నింటినీ ధ్వంసం చేయాలి. అలాకాకుండా కొన్ని చెరువులకే పరిమితం కావడం ఏమిటనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఆకివీడు పరిధిలోని నిడమర్రు మండలం అడవికొలనులోని కొల్లేరు ప్రాంతంలో ఐదో కాంటూరు పరిధిలోని చెరువులకు రెండు రోజుల క్రితం అధికారులు గండ్లు కొట్టారు. ఆగడాలలంకలోనూ ఇలాంటివి జరిగినట్లు తెలుస్తోంది. కొల్లేరులో వేలాది ఎకరాల్లో అక్రమ చేపల చెరువులు ఉండగా కొన్ని చెరువులకే అధికారులు గండ్లు కొట్టడం జనం అనుమానం పడేలా చేస్తోంది. అధికార పార్టీ నాయకుల సూచనల మేరకే ఈ విధంగా కొన్ని చెరువుల వద్దకు అధికారులు వెళ్తున్నారా అనే చర్చ సాగుతోంది. చేపల చెరువుల యజమానులు బెదిరించి దారికి తెచ్చుకునేందుకు నాయకులు ఈ విధంగా చేయిస్తున్నారా అనే ప్రశ్నలు అందరినీ వేధిస్తున్నాయి. గతంలో కొల్లేరులో చేపల చెరువులకు గండ్లు కొడితే అటవీశాఖ అధికారులు ఫొటోలు తీసి మీడియాకు పంపించేవారు. ఇప్పుడు అటువంటి ప్రక్రియ ఏమీ లేకుండాపోయింది. మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పని కానిచ్చేస్తున్నారు. దీంతో దీనివెనుక ఏదో కుట్ర ఉందనే అభిప్రాయం అందరిలోనూ కలుగుతోంది. దీనిపై అటవీశాఖ జిల్లా అధికారి విజయను వివరణ కోరగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే గండ్లు కొట్టడం జరుగుతుందని, దీనిలో వేరే ఎవరి ప్రమేయమూ లేదని స్పష్టం చేశారు. అటువంటి ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు.

> ఐదో కాంటూరు లోపల ఉన్న పలు చేపల చెరువులకు గండ్లు
> సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే అంటున్న అటవీ శాఖాధికారులు
> దాదాపు 18 వేల ఎకరాలకుపైగా అక్రమ చేపల చెరువులు ఉన్నట్లు అంచనా
> అధికారులు కొన్నిచెరువుల వద్దకే వెళ్లడంపై పలు అనుమానాలు
> రాజకీయ ప్రమేయం ఉందంటూ గ్రామాల్లో చర్చ
> బెదిరించి దారికి తెచ్చుకునే యత్నమంటూ ప్రచారం

నూజివీడు మామిడి ప్రతిష్ట పెంపునకు కృషి

ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం
రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్ యార్డు అభివృద్ధి
రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మామిడికి మరింత ఇమేజ్ చేకూర్చి రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేలా స్థానిక మార్కెట్ యార్డును రూ.30 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం మామిడి మార్కెట్ సౌకర్యాల ఏర్పాటుపై రైతులు, వ్యాపారులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు మామిడికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇటీవల కాలంలో నాణ్యమైన మామిడి దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఎంతగానో నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రైతాంగ సంక్షేమానికి సబ్సిడీతో కూడిన పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం విస్మరించిన మామిడి పంటకు బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తామన్నారు. నాణ్యమైన మామిడి పంటకు రైతులు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. నాణ్యమైన మామిడి దిగుబడికి తీసుకోవాల్సిన అవసరమైన చర్యలు, రైతులకు అవగాహన కల్గించేందుకు ఉద్యానవన, మార్కెటింగ్, మామిడి పరిశోధనా శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి కమిటీ నియమించి, మామిడి పంటకు అనుకూలమైన ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి భూసారం పెంచేలా తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. మామిడి రైతుల ఆర్థికాభివృద్ధికి పంటకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తానని, నాణ్యమైన మామిడిని విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన 'ఎయిర్ కార్గో' సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందని, వాటిని సాధించి త్వరలోనే ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను, ఫుడ్ పార్క్‌ను నూజివీడు ప్రాంతంలో ఏర్పాటు చేసి, నూజివీడు ప్రాంతానికి బంగారు భవిష్యత్తును అందిస్తామని మంత్రి పార్థసారథి చెప్పారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ వేసవి వస్తుందంటే నూజివీడు మామిడి ఎప్పుడు వస్తుందా ప్రజలందరూ ఎదురుచూస్తూ ఉంటారన్నారు. అటువంటి నూజివీడు మామిడి నాణ్యతలో ఇటీవల కొంత తగ్గుదల కన్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ లావణ్యవేణి, ఇఇ శ్రీనివాసరావు, నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి, ఉద్యానవన శాఖ అదనపు డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, వ్యాపారులు మార్కెట్ యార్డులో మామిడి రైతులకు కల్పించిన సౌకర్యాలపై హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి సుపరిపాలన వారోత్సవాలు

ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలే లక్ష్యం
అధికారులతో సమీక్షించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి




ప్రజాశక్తి - ఏలూరు

ప్రశాసన్ గావ్‌కీ ఓర్-2024 కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 19వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ (జిజిడబ్ల్యు) ప్రచార కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో గుడ్ గవర్నెన్స్ వీక్ (జిజిడబ్ల్యు) ప్రచార ప్రణాళికపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రశాసన్ గావ్‌కీ ఓర్-2024 కార్యక్రమ నిర్వహణకు జిల్లాలో విస్తృతమైన ప్రచారాన్ని, ప్రజల్లో అవగాహనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో సాగుతోన్న ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజాఫిర్యాదుల పరిష్కారం, పబ్లిక్ సర్వీస్ డెలివరీని మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, వర్క్‌షాపులు క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి నిర్వహించాలన్నారు. సుపరిపాలనపై అవగాహన కల్పించే విధంగా విద్యాసంస్థల్లో క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఆయా జిల్లా అధికారులు సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించిన కనీసం మూడు విజయగాథలను పొందుపర్చాలన్నారు. ఈ నెల 23న గోదావరి సమావేశ మందిరంలో వర్క్‌షాప్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఇన్‌ఛార్జి జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఆర్.విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి వి.జయప్రకాష్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పిడి పి.శారద, డ్వామా పీడీ సుబ్బారావు, ఎల్‌డిఎం చంద్రశేఖర్, డిపిఒ అనురాధ, డిపిఆర్‌ఒ రామచంద్రరావు తదితరులు హాజరయ్యారు.

దోసపాడు పేదలకు న్యాయం చేయాలి

డిఆర్‌ఒకు వినతి



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న వ్యకాస నేత రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

దోసపాడు పేదలు, దళితులకు అర్హులైన అసైన్డ్‌దారులకు ఫ్యామిలీ సర్టిఫికెట్లు, మ్యుటేషన్ మరణ ధ్రువీకరణ పత్రాలు, వారి వారసులకు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద డిఆర్‌ఒ విశ్వేశ్వరరావుకు వ్యవసాయ కార్మిక సంఘం, దోసపాడు భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడులో దళితులు, పేదలు రెండు సంవత్సరాలకుపైగా వారి అసైన్డ్, సీలింగ్ భూములు పంచాలని, ఆక్రమణదారుల నుంచి తమకు రక్షణ కల్పించాలని, భూముల్లో వారికి సాగు అవకాశం కల్పించాలని పోరాడుతున్నారు. మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాతలు, తండ్రులు చనిపోతే వారికి వారసులుగా ఉన్న తమకు చనిపోయిన వారి మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకసార్లు రెవెన్యూ శాఖాధికారుల కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. పేదలు అడుగుతున్న పట్టాలు, పాసుబుక్స్ నిమిత్తం వారి వారసులుగా గుర్తించడం కోసం ఫ్యామిలీ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు చట్టప్రకారం అర్హులైన పేదలందరికీ భూ పంపిణీ ద్వారా పంపిణీ చేయాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జిల్లాలో భూముల సమస్యలు లేవని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తూతూమంత్రంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. గ్రామ రెవెన్యూ సదస్సులు సక్రమంగా నిర్వహించాలని, అర్హులైన పేదలందరికీ భూపంపిణీ ద్వారా భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనవరి 15 నుండి జరిగే భూపోరాటంలో చోటుచేసుకునే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీనిపై డిఆర్‌ఒ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సమస్యపై తహశీల్దార్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అంతగాని ఆనందరావు, డి.నాగేంద్రతోపాటు పోరాట కమిటీ సభ్యులు రాజు, భూషణం, లక్ష్మి, మాణిక్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రొవ్విడిలో రేవ్ పార్టీ కలకలం!

> జనసేన గ్రామాధ్యక్షుడు పుట్టినరోజు సందర్భంగా పార్టీ
> ఈ నెల 12న ప్రత్యేకంగా ఏర్పాటు
> జనసేన నాయకుడు ఇంద్రకుమార్ సస్పెండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామంలో రేవ్ పార్టీ దృశ్యాలు బుధవారం కలకలం రేపాయి. క్రొవ్విడి గ్రామ జనసేన అధ్యక్షుడు వాకమూడి ఇంద్రకుమార్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 12వ తేదీన ప్రత్యేక పార్టీ ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులో 12వ తేదీ రాత్రి ఆ పార్టీ జరిగింది. ఈ పార్టీకి అమ్మాయిలను తీసుకొచ్చి రేవ్ పార్టీ తరహాలో వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. పార్టీలో మహిళలు నగ్నంగా డ్యాన్స్ చేస్తున్న దృశ్యాలు బుధవారం వైరల్ అయ్యాయి. రాజకీయ విభేదాల కారణంగా కొంతమంది ఈ వీడియోలను ఆలస్యంగా బయటపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో వాకమూడి ఇంద్రకుమార్‌ను జనసేన గ్రామ పార్టీ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు నిమ్మల దొరబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై నిడమర్రు ఎస్ఐ వీరప్రసాద్ వివరణ కోరగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే నిందితులను మాత్రం అరెస్టు చేయకుండా జనసేన అధినాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. నిందితులను అరెస్టు చేస్తారో.. కాపాడతారో వేచిచూడాలి.

టిడిపిలో ఆళ్ల నాని చేరిక వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీ మంత్రి ఆళ్ల నాని టిడిపిలో చేరిక వాయిదా పడింది. దీంతో ఆయన టిడిపిలో ఎప్పుడు చేరతారనేది సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు ఆళ్లనాని చేరిక వాయిదా పడిన సంగతి తెలిసిందే. వైసిపిలో మంత్రిగా పని చేసి అంతా తానై చక్రం తిప్పిన ఆళ్ల నాని ఎన్నికల తర్వాత ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. వైసిపి పీకి రాజీనామా చేసి బయటికి వచ్చారు. టిడిపిలో చేరేందుకు సిద్ధమవ్వగా స్థానిక టిడిపి కేడర్ ఆయన చేరికను తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో సిఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు జోక్యంతో స్థానిక ఎంఎల్ఎ, కేడర్ మౌనం వహించింది. బుధవారం ఆళ్ల నాని టిడిపిలో చేరుతున్నట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మీడియా సమావేశంలో ప్రకటించారు. అయితే బుధవారం చంద్రబాబు హైదరాబాద్ వెళ్లడంతో నాని చేరిక వాయిదా పడినట్లు తెలిసింది. గురువారం చేరతారా లేక మరో సారి ముహూర్తం పెట్టుకుంటారా అనేది వేచిచూడాలి.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ట్రూఅప్‌ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి
లేకుంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదు
సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు తగ్గించకపోతే, స్మార్ట్ మీటర్లు తొలగించకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని, ప్రభుత్వ పతనం తథ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక పవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ బిల్లుల దగ్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ సౌరవిద్యుత్ పది శాతం తప్పనిసరిగా చేసుకోవాల్సిందేనని, యూనిట్‌ను రూ.4.50 పైసలకు కొనాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ఆధారంగా గత వైసిపి ప్రభుత్వం, నేటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపుతున్నాయని తెలిపారు. తక్షణమే ఈ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, లేకపోతే ప్రజలను సమీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విద్యుత్ పోరాటాలు సాగిస్తామని రవి హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడమంటే రైతుల మెడలకు ఉరితాళ్లు బిగించడమేనన్నారు. సిపిఎం జిల్లా, ఏలూరు నగర నాయకులు, కార్యకర్తలు విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, పట్టణ నాయకులు గుడిపాటి నర్సింహారావు, ఎ.శ్యామలారాణి, కె.విజయలక్ష్మి, వివివిఎస్.ప్రసాద్, వైఎస్.కనకరవు, జి.రవికిషోర్, పి.ఆదిశేషు, ఎం.అరుణ కుమారి, ఎం.ఇస్సాక్, ఎం.సత్యం, జి.గోపీ పాల్గొన్నారు.

ముసునూరు : స్థానిక మండపం సెంటర్ వద్ద సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మం డల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, పిల్లి మురళి, కంచర్ల ప్రసాద్, కంచర్ల దుర్గారావు, కె.కుటుంబరావు, నాని, కంచర్ల రామ, కూతటి కొండలరావు, గంగుల సత్యం పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలులో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, భీమడోలు నాయకులు ఎం.పానకాలు, బీబీ, కేతా నాగయ్య పాల్గొన్నారు.

కలిదిండి : కలిదిండి ప్రధాన సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. సిపిఎం కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, భాస్కరరావు, మాధవ, మహేష్, సత్యనారాయణ, వినోద్, బాలాజీ, రామ నాగేంద్రం, ఏసు, నాగన్న, దొర రాజు పాల్గొన్నారు.

పెదపాడు : స్థానిక బండ్ల తూము సెంటర్ వద్ద విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి గుండపనేని సురేష్, నాయకులు లింగం కృష్ణారావు, షేక్ కరీముల్లా, రెడ్డి లక్ష్మణరావు, సిపిఐ నాయకులు గన్ను వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో...

టి.నర్సాపురం : మండలంలోని ఎఎస్ఆర్.నగర్ మూడు రోడ్ల సెంటర్‌లో అదానీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళి, ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి మడకం కుమారి, ఎస్ఆర్.నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో...

కామవరపుకోట రూరల్ : కామవరపుకోట గ్రామంలోని ఎస్‌సి పాత మాలపల్లిలో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎ.ప్రాన్సిస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదానితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, వీరయ్య, వెంకటేశ్వరరావు, బి.పెంటమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిడమర్రు, భువనపల్లి గ్రామాల్లో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు, లావేటి చంద్రరావు, రామవరపు శ్రీను, పేరుకుల పుల్లయ్య, శంకు సీతారామయ్య, గిద్దా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



భీమడోలులో....

వేలేరుపాడు రూరల్ : మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మడివి.దుర్గారావు మాట్లాడారు. కొత్త వెంకటేశ్వర్లు, గుమ్మల వెంకటనరసయ్య, వినియోగదారులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని పంగిడిగూడెం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. పట్టణ కమిటీ సభ్యురాలు ఎస్‌కె.సుభాషిని అధ్యక్షత వహించగా పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లా డారు. పార్టీ మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, అందుగుల ప్రభాకరరావు, యాగంటి సీత, వామిశెట్టి నరసరా వు, పట్టణ, కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబు సుభాని, వంగ గోపీ, నాయకులు ఆరేటి రామచం ద్రరావు, బి.నాని, ఎం.సునీల్, ఎ.స్టాలిన్, డి.ఆశీర్వాదం, ఆర్.దానియేలు పాల్గొన్నారు.

పోలవరం : స్థానిక ఏటిగట్టు సెంటర్ వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తామ బాలరాజు, సముద్రాల సాయికృష్ణ, గోకూరి పాండవులు, నాయకులు పూనెం పొట్టియ్య, ఆర్.వెంకట్రావు, తెల్లం లక్ష్మి, మీడియం రాజమణి, కుంజం లక్ష్మి, తెల్లం ఆదిలక్ష్మి, కత్తుల ముక్కరెడ్డి కత్తుల రాజు, బంధం రమాదేవి, కొవ్వాసి గంగ పాల్గొన్నారు. మండలంలోని వింజరం గ్రామంలో మంగళవారం రాత్రి కొవ్వొతులతో నిరసన తెలిపారు.



ముసునూరులో....

కుక్కునూరు : స్థానిక కుక్కునూరు మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు తగ్గించేందుకు మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, పులదాసు రమేష్, ఎస్‌కె.మహబూబ్‌పాషా, వెంకటేశ్వర్లు, చంటి, సాయికృష్ణ పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని గురుబట్లగూడెం రోడ్డు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాండురంగారావు మాట్లాడారు. సిపిఎం సీనియర్ నాయకులు సూర్యకుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.సత్యనారాయణ, అబ్బిరెడ్డి, రాహుల్, అనురాధ, వాసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో అల్లుశ్రీను ప్రతిభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

విజయవాడ మాకినేని భవన్‌లో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మండలంలోని ఉప్పాకపాడు ఉపాధ్యాయులు అల్లుశ్రీను రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో బాల కార్మికుడు మూకాభినయంలో ద్వితీయ, ఝాన్సీ లక్ష్మీ భాయ్ బుర్ర కథలో అల్లు శ్రీను టీమ్ రాజారావు, సోని ప్రథమ స్థానం సాధించారు. వీరికి జనవరి నాలుగు, ఐదు తేదీల్లో కాకినాడ యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో బహుమతులు అందిస్తారు. రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో గెలుపు సాధించినందుకు అల్లు శ్రీనును ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారులు నిమ్మగడ్డ రవీంద్ర భారతి, భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.


పాత్రలో అల్లు శ్రీనివాస్

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సాటి మనిషికి సాయం చేయాలనే తలంపుతో సేవా కార్యక్రమాలను చేపట్టడం అందరికీ ఆదర్శనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు సత్యనారాయణ థియేటర్ సమీపంలోని ఒక ఫంక్షన్ హాలులో బుధవారం బడేటి శ్రీహరిరావు ట్రస్ట్, అమ్మానాన్నా ఛారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 25వ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రారంభించారు. శిబిరంలో వివిధ విభాగాల వైద్యనిపుణులు గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, బిపి, షుగర్ వంటి వ్యాధుల నిర్ధారణా పరీక్షలు, వైద్యసేవలతో పాటు అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ పది మందికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో అమ్మానాన్నా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ముందు వరుసలో ఉంటారని అభినందించారు. కేవలం వైద్యసేవలతో సరిపెట్టకుండా అవసరమైన వారికి మందులను అందించి, ఇంకా మెరుగైన వైద్యసేవలు, అవసరమైన వారికి తగు సేవలందే విధంగా ఆలోచన చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ విషయంలో అవసరమైన వారికి ఎన్‌టిఆర్ వైద్యసేవల ద్వారా మెరుగైన వైద్యాన్ని అందించేలా తాను కూడా చర్యలు తీసుకుంటానని ఎంఎల్ఎ చంటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మానాన్నా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మారం అను, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, పూజారి నిరంజన్, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ట్రైకార్ ఛైర్మన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని చేగొండపల్లి పునారావాస గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమైన బాధిత కుటుంబాలకు బుధవారం ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆర్థిక సాయం అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మూడు ఇళ్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను బొరగం శ్రీనివాసులు పరామర్శించి వారికి కూటమి పాలన అండగా ఉంటుందని ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా రూ.ఐదు వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రగడపల్లి సర్పంచి కలుం బాపిరాజు, బొరగం బుల్లిదొర, తెల్లం సూర్యచంద్రం, కొక్కిర రాంబాబు, ముచ్చిక నాగేశ్వరరావు, కుర్సం రమేష్ పాల్గొన్నారు.


ప్రదేశాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసులు

'హీల్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సమాజంలో ఆర్థిక వనరులు కలిగి ఉండటమే కాకుండా పేద, మధ్య తరగతి ప్రజల పట్ల దాతృత్వ గుణం కలిగి ఉండి వారికి ఏదోక రూపంగా సహాయ సహకారాలు అందించడం ఎంతో అభినందనీయమని అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు కాజా బాబు అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో కేశినేని శివనాగప్రసాద్-శాలిని, ఈడ్పుగంటి కృష్ణమూర్తి-అనంతలక్ష్మి, ఉప్పల లక్ష్మీతులసిలు అందించిన ఆర్థిక సాయంతో ఐదుగురు వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందించారు. అనంతరం మహిళల హాస్టల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్, హీల్ ఇండియా ఛైర్మన్ రామావతార్ యాదవ్, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నున్న విజయ్, ప్రముఖ సంఘసేవకులు కాకర్ల శంకరరావు, గొర్రా జ్యోతికుమారి, ప్రముఖదాత వేగే శ్రీనివాసరావు, హీల్ కార్యవర్గ సభ్యులు, పలువురు దాతలు పాల్గొన్నారు.


కృత్రిమ కాళ్లు పొందిన వారితో దాతలు

నేరాలు - ఘోరాలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరుల అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీలకు పాల్పడుతున్నవారిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశం మందిరంలో బుధవారం ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాల వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకాతిరుమల, భీమడోలు, లక్కవరం, తడికలపూడి, టి.నర్సాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో కొంతకాలంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీలపై ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల్లో భాగంగా భీమడోలు సర్కిల్ పోలీసులు కేసు నమోదు చేసి దీనిపై విచారణ ప్రారంభించారు. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని బుధవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వరుస దొంగతనాలకు పాల్పడినవారు వారేనని పోలీసులు గుర్తించారు. ఈ దొంగతనాల్లో మొత్తం 41 ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి వాటిలో ఉన్న రాగి వైరును దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. 639 కేజీల కాపర్‌ను పోలీసులు రికవరీ చేశారు. వాటితో పాటు రెండు ద్విచక్ర వాహనాలను కూడా వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన మానుకొండ వెంకటరావు, జంగారెడ్డిగూడెం మండలం అదే ప్రాంతానికి చెందిన మొగ్గల దుర్గాప్రసాద్, అతని సోదరుడైన ముగ్గల శ్రీనివాసరావులు నిందితులని తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పాతంగలగూడెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహరావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మారుజాతి కలప లారీ పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దర్భగూడెం బీట్ పరిధిలో లక్ష్మీపురం జాతీయ రహదారి వద్ద బుధవారం తెల్లవారుజామున అటవీ శాఖాధికారులు తనిఖీలు చేస్తుండగా విసన్నపేట నుంచి అక్రమంగా తరలిస్తున్న మారుజాతి కలప లారీని పట్టుకున్నట్లు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ధర్మారావు తెలిపారు. అనంతరం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీని జంగారెడ్డిగూడెం రేంజ్ కార్యాలయనికి తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బీట్ అధికారి లలిత, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మంగపతి బోదెకు శాశ్వత ప్రాతిపదికన కాలువ పనులు చేపట్టాలి

కొత్త పట్టిసీమ రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీ పరిధిలోని మంగపతి బోదె సప్లై కాలువ పనులు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని ఆయకట్టు పరిధిలోని రైతులు కోరుతున్నారు. బుధవారం రైతులు విలేకరుల వద్ద తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. ఈ సప్లై కాలువ కింద సుమారు రెండు వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ప్రతి ఏటా వచ్చే కొవ్వాడ కాలువ వరద నీరు వల్ల సప్లై కాలువ గండి పడి వందలాది ఎకరాలు పంట ముంపునకు గురై రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నామన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన అధికారులు కాలువ మరమ్మతులు నిమిత్తం రూ.9.60 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులకు సంబంధించి కోట రామచంద్రపురం మైనర్ ఇరిగేషన్ డివిజన్ అధికారులు ఆధ్వర్యంలో అక్టోబర్ 16వ తేదీన టెండర్లుకు పిలిచారన్నారు. అయితే టెండర్లలో శాశ్వత ప్రాతిపదికన చేపట్టడం కాకుండా తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా ఇసుక బస్తాలతో పూడ్చే విధంగా ఉదాహరించారన్నారు. అయితే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా టెండర్లు ఫైనల్ చేయలేదన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ముగిసి కాలువలో నీరు సైతం తగ్గిందన్నారు. ఇసుక బస్తాలు వేయడం వల్ల మళ్లీ వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పంట పాడైపోయి సమస్య యధావిధిగా ఉండే అవకాశం ఉందన్నారు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టి తమను వరద ముంపు నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని రాతపూర్వకంగా ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎఇఇ సురేష్‌ను వివరణ కోరగా గత 30 ఏళ్ల నుంచి ఇదే విధంగా మరమ్మతులు కొనసాగిస్తున్నామని, శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని, మంజూరు కాగానే నిర్మాణం చేస్తామని వివరించారు. వీరపు రాజు ధర్మరాజు, వీరపురాజు వెంకట శ్రీరామ్మూర్తి, తోట సూర్యనారాయణ, బాలకుర్తి చిన్నవెంకటరత్నం, కడియం భద్రం, సిద్ధంశెట్టి సత్యనారాయణ, వీరపురాజు నరసింహమూర్తి, వీరపరాజు వీర రాఘవులు, తోట సత్యనారాయణ ఉన్నారు.


మాట్లాడుతున్న కొత్త పట్టిసీమ రైతులు

ఏరియా ఆసుపత్రిలో జెడి తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ జె.రత్నవల్లి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసూతి విభాగాన్ని సందర్శించి, గర్భిణుల విషయంలో అత్యవసర పరిస్థితులను ముందుగా గుర్తించాలన్నారు. గర్భిణులు ప్రసూతి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జనరల్ వార్డు, సర్జికల్ వార్డులను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేంద్రసింగ్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాల అభివృద్ధి కమిటీ నియామకం

ప్రజాశక్తి - దెందులూరు

గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు నూతన అభివృద్ధి కమిటీని నియమించారు. ప్రెసిడెంట్‌గా పూజారి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా కొండేటి హనుమంతు నియమితులయ్యారు. కార్యదర్శిగా ముప్పాళ్ల గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఏనుగు అచ్చారావు, సభ్యులుగా సింహాద్రి సతీష్, బజారు గణేష్, కేబుల్ శ్రీనులను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదేశాల మేరకు నియమించినట్లు టిడిపి దెందులూరు మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) వివరించారు. బుధవారం కళాశాలలో నూతన కమిటీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియెలు, లెక్చరర్లు సత్కరించారు.

గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాలాభివృద్ధికి అధికారులతో పాటు ఆయా గ్రామాల్లోని గ్రామ ప్రముఖులు కూడా కృషి చేయాలని ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్‌ను నియమించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఆసుపత్రిలో ఎనిమిది కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, మూడు మేజర్ ఆపరేషన్లు డాక్టర్ సునీత ఆధ్వర్యంలో చేసినట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కొండ్రు దేవా తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌ల కొరత గురించి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని, జిల్లా అధికారులైన డాక్టర్ పాల్ సతీష్‌తో మాట్లాడి గైనకాలజిస్ట్‌ల సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ఫలితాలు వచ్చాయని తెలిపారు.

రెగ్యులర్ గైనకాలజిస్ట్‌ను కేటాయించాలి

ఆసుపత్రిలో వారానికి రెండు రోజులు గైనకాలజిస్ట్ అందుబాటులో ఉంటే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయంటే, వారం రోజులు అందుబాటులో ఉంటే మరెన్నో ఉత్తమ ఫలితాలు వస్తాయని ప్రజాసంఘాల నాయకులు చెబుతున్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రికి పూర్తిస్థాయిలో రెగ్యులర్‌గా గైనకాలజిస్ట్ ఉంటే మరెన్నో ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని, వారం రోజులు గైనకాలజిస్ట్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు

కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులు తమ భూమిపై సంపూర్ణ హక్కులు కలిగి ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వైవాకలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల వద్దకే పాలన అనే విధంగా మండల స్థాయి అన్ని శాఖల అధికారులు మీ వద్దకు వచ్చారని, మీ సమస్యలు అధికారులకు వివరించి పరిష్కరించుకోవాలని చెప్పారు. గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, విఆర్ఒలు, రెవెన్యూ సిబ్బంది, ఎన్‌డిఎ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన బడేటి బుజ్జి'


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జి అని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆయన కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు నియోజకవర్గ అభివృద్ధిలో, ప్రజా సంక్షేమంలో తనదైన పాలనతో ముందుకెళ్లిన ఏలూరు మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జి ఐదో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్మారకార్థం ఏలూరు జెడ్‌పి సెంటర్‌లో స్మరణ క్షేత్రం పేరుతో బడేటి బుజ్జి కాంస్య విగ్రహ ఏర్పాటు పనులు ఫ్లాష్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను సైతం సిద్ధం చేశారు. సన్నిహితుడా సలామ్ అనే పేరుతో చేపట్టిన కార్యక్రమ బ్రోచర్లను ఎంఎల్ఎ బడేటి చంటి బుధవారం ఆవిష్కరించారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు.

సిఐటియు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కుక్కునూరు

తలసేమియా పిల్లల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైందని సిఐటియు మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ అన్నారు. లారీ యూనియన్ వార్షికోత్సవం సందర్భంగా ది లారీ, మినీ వ్యాన్, టాటా ఎసి ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కుక్కునూరులో యూనియన్ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ యూనియన్ కార్యదర్శి వలిపాషా అధ్యక్షతన నిర్వహించిన సభలో సాయికిరణ్ మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్లా గొప్ప దానం రక్తదానమన్నారు. ఖమ్మం ఎన్‌జిఒ సంస్థ తలసేమియా వ్యాధితో ఇబ్బందులు పడుతున్న 400 మందికి ఉచితంగా సేవలు చేస్తున్నారన్నారు. ఆ వ్యాధితో ఇబ్బందులు పడుతున్న వారికి యూనియన్ తరపున సహకారం చేయాలనే మంచి ఉద్దేశంతో ఈ రక్త దాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 40 మంది పాల్గొని రక్తదానం చేశారన్నారు. ప్రధానంగా శ్లోక స్కూల్‌లో కేరళ నుంచి వచ్చి ఉపాధ్యాయులుగా సేవలు చేస్తున్న వారు రక్తాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో మారేడుబాక విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్న సాయి 17వ సారి రక్తదానం చేశారని తెలిపారు. టిడిపి మండలాధ్యక్షులు, కుక్కునూరు ఎంపిటిసి సభ్యులు ములిశెట్టి నాగు, తలసేమియా పిల్లలకు భరోసా కోసం రూ.ఐదు వేల ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ కార్యదర్శి వలిపాషా, టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగు, కుక్కునూరు మేజర్ పంచాయతీ సర్పంచి రావు మీన వినోద్, ఉప సర్పంచి పిచ్చుక రాజు, సిపిఎం మండల కార్యదర్శి బియ్యాన శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, లారీ యూనియన్ నాయకులు గంజి రాంబాబు, ఓగిరాల నాగరాజు, కట్టబోయిన మల్లేష్, వైసిపి నాయకులు మల్లెల చంటినాయుడు, రాము, టిడిపి నాయకులు అంగిరేకుల బాలాజీ, సిఐటియు నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు, తిరోజుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

'శ్రీసాయి' సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యా వ్యాప్తికి, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తున్న శ్రీ సాయి స్వచ్ఛంద సేవా సంస్థ (శ్రీ సాయి హెల్పింగ్ హాండ్స్ సంస్థ) సేవలు అభినందనీయమని భీమడోలు ఎంపిడిఒ పద్మావతిదేవి తెలిపారు. శీతాకాలంలో విద్యార్థుల ఇబ్బందులు, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను గమనించిన సంస్థ యాజమాన్యం భీమడోలు మండల పరిషత్ అధికారి సిఫార్సు మేరకు పూళ్ల బాలికల ప్రత్యేక వసతి గృహానికి చెందిన విద్యార్థినులకు వేడి నీటి సరఫరా కోసం, భీమడోలు సిహెచ్‌సికి వచ్చే రోగులకు చికిత్సలో భాగంగా వేడి నీరు సరఫరా చేసే వేలాది రూపాయల విలువైన నాలుగు వేడినీటి సరఫరా యంత్రాలను భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వేదికగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలోఎంపిడిఒ చేతుల మీదుగా ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులకు, పూళ్ల బాలికల ప్రత్యేక వసతి గృహం నిర్వాహకులకు అందించారు. భీమడోలు ఆరోగ్య కేంద్రం తరపున వైద్యులు శ్రీలత, డాక్టర్ అపర్ణ వాటిని అందుకున్నారు. అనంతరం అతిథులు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కరరావు, శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఘనత

ఇంటర్ యూనివర్సిటీ రన్నింగ్ ఛాంపియన్‌షిప్‌లో పలు పతకాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఎ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సిహెచ్.శంకర్ ఈ నెల 13, 14 తేదీల్లో రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ రన్నింగ్ ఛాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల హర్డిల్స్‌లో గోల్డ్ మెడల్, 400 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ గుప్తా గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో శంకర్‌ను ప్రిన్సిపల్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరిబాబు మాట్లాడుతూ ఈ నెల డిసెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు కిస్ యూనివర్సిటీ భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియన్ యూనివర్సిటీస్ కాంపిటీషన్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారని, తమ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించడం ద్వారా కళాశాలకు పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, కె.రమేష్, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఎస్.పరమేశ, ఎం.కృష్ణచైతన్య, టివిఎస్.పద్మావతి, డాక్టర్ పిఆర్.కావ్యశ్రీ, విద్యార్థిని అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది

రెవెన్యూ సదస్సుల సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

రెవెన్యూ సదస్సుల సేవలను వినియోగించుకోవాలని సదస్సుల భీమడోలు మండల ప్రత్యేకాధికారి, బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆర్.నాగరాణి కోరారు. భీమడోలులో రెవెన్యూ సదస్సులను బుధవారం సర్పంచి సునీత మాన్‌సింగ్ అధ్యక్షతన తహశీల్దార్ బి.రమాదేవి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారితో పాటు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, కొండ్రెడ్డి విశ్వనాథం, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమడోలు తహశీల్దార్ సదస్సుల ద్వారా 49 రకాల రెవెన్యూ సేవలు యూజర్ ఛార్జీలు లేకుండా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల వరకు 42 వినతులు రాగా, వీటిలో 17 సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్‌కుమారి, సర్వేయర్ ధర్మారావు పాల్గొన్నారు.

చింతలపూడి : భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని చింతలపూడి తహశీల్దార్ డి.ప్రమద్వర అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో పాల్గొన్న తహశీల్దార్ డి.ప్రమద్వర దృష్టికి పట్టణంలో శ్మశాన భూమి, మెయిన్‌రోడ్ ఆక్రమణకు గురయ్యాయని దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రమద్వర మాట్లాడుతూ శ్మశానవాటిక భూమి ఆక్రమణపై చర్యలు తీసుకుంటామన్నారు. మెయిన్ రోడ్డు ఆక్రమణపై సంబంధిత శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడడం నేరమన్నారు. ఈ సదస్సులో పలు సమస్యలపై దరఖాస్తులు రాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డి.ప్రమద్వర అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిహెచ్.ధర్మరాజు, తాటి అప్పారావు, కె.శేషగిరిరావు, మన్యం సత్తిబాబు, తూము విజయ్ కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ముసునూరు :ముసునూరు గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ శర్మ మాట్లాడుతూ సదస్సుల్లో రెవెన్యూ సమస్యలతో పాటు గ్రామ సమస్యలు కూడా పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు 15 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ కె.వెంకటరమణ, విఆర్ఒలు రవికాంత్, మస్తాన్‌రావు, మణేంద్ర, విజయ్‌కుమారి, నవీన్, యశోద, ఎస్.శ్రీనివాసరావు, హరిబాబు, హనీబాబు, రైతులు పాల్గొన్నారు.

కళాశాలలో పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని బుధవారం సర్ సిఆర్.రెడ్డి అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో యూనిట్ అధ్యక్షులు షేక్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి, అసిస్టెంట్ ట్రెజరరీ ఆఫీసర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్ల ఆశాజ్యోతి, సేవామూర్తి ధరమ్ స్వరూప్ నకారా సేవలు చిరస్మరణీయమన్నారు. పలు రంగాల్లో పనిచేసి తన కృషి ద్వారా న్యాయవ్యవస్థ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం తీసుకురావడం గొప్ప పరిణామమన్నారు. ట్రెజరరీ ద్వారా సమస్యలుంటే తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎ.రామరాజు, ఆర్‌సిటిఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరావులు మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగి ప్రాథమిక హక్కు అని, ఎవరి దయాభిక్ష కాదని, పెన్షన్ గత సేవలకు ప్రతిఫలమని అంటూ విశ్రాంత అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ వేడుకల్లో అధ్యాపకులుగా విశేష సేవలందించిన సీనియర్ సభ్యులు ఎం.సంపదరావు, వై.రాజారాం, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరావు, వి.వెంకటేశ్వరావు, డాక్టర్ కె.రాణి, ఎం.రమా సత్యవతిలను ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలు తమ స్పందన తెలిపారు. ముందుగా డిఎస్.నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి.సుబ్బలక్ష్మి, కోశాధికారి పి.ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్‌సి.డేనియల్, పలువురు విశ్రాంత అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనగా నాలుగు రోజుల పాటు రెండు విడతలుగా పంచాయతీ సర్పంచులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయని భీమడోలు ఎంపిడిఒ, శిక్షణా తరగతుల కోర్సు డైరెక్టర్ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో పాల్గొన్న సభ్యులు వివిధ అంశాల పట్ల అవగాహన పెంచుకున్నారని, సందేహాలకు సమాధానాలు పొందారన్నారు. బుధవారం నిర్వహించిన ముగింపు తరగతుల నిర్వహణ కార్యక్రమాన్ని కోర్సు జిల్లా డైరెక్టర్ ప్రసంగిరాజుతో పాటు పంచాయతీ పాలనపై సామర్లకోట కేంద్రంగా నిర్వహిస్తున్న కేంద్రానికి చెందిన ఫ్యాకల్టీ ఎం.చక్రపాణిరావు పరిశీలించి తగు సూచనలు చేశారు. కోర్సు డైరెక్టర్, కోర్సు సహాయ డైరెక్టర్, భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి శిక్షణా తరగతులు కొనసాగిన తీరును వారికి వివరించారు. నేటి శిక్షణలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనపై పంచాయతీరాజ్ భీమడోలు ఎఇ, సామాజిక న్యాయం, భద్రత అంశాలపై వెలుగు ఎపిఎం రత్నకుమారి, సమర్థవంతమైన పాలన అంశంపై ఎంపిడిఒ మహిళా స్నేహపూర్వక గ్రామాలపై వెలుగు ఎపిఎం రత్నకుమారి సభ్యులకు వివరించారు.

కుక్కునూరు :మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యలపై నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ నరసింహారావు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ లక్ష్మీకుమారి, ఎపిఎం భానుమతి పాల్గొన్నారు.

21న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆవరణలో ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం పది గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తిరువీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్, మదర్‌థెరిసా సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, తిరివీధి కృష్ణ తెలిపారు. నూజివీడులో ఆయన బుధవారం మాట్లాడుతూ మెగా ఉచిత వైద్య శిబిరంలో నేత్ర, దంత, జనరల్ విభాగాలకు సంబంధించి ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తారని తెలిపారు. అవసరమైనవారికి శస్త్రచికిత్సలను కూడా చేయనున్నట్లు తెలిపారు. ముందుగా 9640324266, 8499026392 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సదవకాశాన్ని పట్టణ ప్రాంత ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తుపాన్ దృష్ట్యా చేతికొచ్చిన పంటలను భద్ర పరుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.గంగాధర్ తెలిపారు. జీలుగుమిల్లి, బర్రింకలపాడు పరిధిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మిరప, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. చేతికి వచ్చిన పత్తి, వేరుశనగ, వరిధాన్యం కల్లాల్లో ఉంటే సురక్షితమైన ప్రదేశాలకి తీసుకువెళ్లి భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కనక దుర్గ, లావణ్య, జెడ్‌బిఎన్ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని మోండలెజ్ కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోండలెజ్ కంపెనీ, ఆఫ్రో సంస్థల ఆర్థిక సహాయంతో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోండలెజ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్లు రవీంద్ర, విజయ్‌కుమార్, టెక్నికల్ ఆఫీసర్లు దేముడు, అయ్యనబాబు, మండల విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, ఉపాధ్యాయులు ఆర్‌విజి.కృష్ణారావు, ఫీల్డ్ ట్రైనర్ లక్కపాము అశోక్, కోకో రైతులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep.by its Branch Manager it is stated that Smt. Dharavathu Rajini, W/o.Bangaru Babu, 31 Yrs, R/o.Krishnapuram Village, H/o. T.Narasapuram Village and Mandal, Eluru District., is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If any body having any objection, they can send the objections to me or to my client with in 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SCHEDULE OF THE PROPERTY

RCC Buliding bearing H.No.14-158 with a plinth area of 653.4 Sq. feet along with its house site of an extent of 72.6 Sq.yards or 60.9 Sq. meters or Ac.0-01 1/2 cents in R.S.No.370 situated at Krishnapuram, T.Narasapuram Village and Mandal, Eluru District, bounded by
EAST: R&B Road from T.Narasapuram to Makkinavari gudem.
SOUTH: House and place of Bhukya Nagamani.
WEST: Panchayathi Road.
NORTH : House and place of Bhukya Veerla Venkamma

P.Ganesh Babu
Kothagudem Advocate, Kothagudem
Dt.18-12-2024 Cell : 98492 46278